పీఆర్ ఇంజనీర్లకు బదిలీల కౌన్సెలింగ్

అందరూ పీఐయూ, క్యూసీలకు వెళ్తామంటే కుదరదు

ఈఎన్‌సీ బాలు నాయక్

అనంతపురం న్యూటౌన్ మే 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ ఇంజనీర్లకు మంగళవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతపురం పంచాయతీ రాజ్ సర్కిల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతపురం ఎస్ఈ జహీర్ అస్లామ్, కడప ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, కర్నూలు ఎస్ఈ రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈఎన్‌సీ బాలు నాయక్ అధ్యక్షతన ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రాజెక్ట్ ఇంప్లిమేంటేషన్ యూనిట్ (పీఐయూ), క్వాలిటీ కంట్రోల్ (క్యూసీ) విభాగాలు కావాలంటే కుదరదు. పీఆర్ఐలో క్షేత్రస్థాయి ప్లేసులు ఆప్షన్ ఇచ్చిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారు, కార్యాలయాల్లో మకాం వేసిన వారు తప్పని సరిగా బయటకు వెళ్లాల్సిందేనని చెప్పారు. స్పౌజ్, ఆరోగ్య సమస్యలతో ఆధారాలు చూపిన వారికి మాత్రం మినహాయింపు ఇచ్చారు. అనంతపురం సర్కిల్ కార్యాలయంలో జేఈఈలు శ్రీనివాసకుమార్, లక్ష్మీదేవిలు ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారిలో ఉన్నారు. శ్రీనివాస కుమార్ సెప్టెంబరులో ఉద్యోగ విరమణ పొందాల్సి ఉండటంతో ఆయనను అక్కడే ఉంచారు. లక్ష్మీదేవిని పెనుకొండకు కేటాయించారు. అదే తరహాలో పీఐయూ సూపరింటెండెంట్ ఐదేళ్లు పూర్తి కావడంతో స్థాన చలనం తప్పలేదు.

ఉమ్మడి జిల్లా బదిలీ వివరాలు

అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న డీఈఈల్లో నలుగురు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరిలో రవీంద్ర కుమార్, భరత్‌ప్రకాష్‌రెడ్డి, మురళీధర్, మధుప్రకాష్ ఉన్నారు. వీరిలో భరత్‌ప్రకాష్‌రెడ్డి ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందుతుండటంతో మినహాయింపు ఇచ్చారు. మిగిలిన ముగ్గురు పలు కేటగిరీల కింద దరఖాస్తు చేసుకోవడంతో స్థాన చలనం లేకుండా జాగ్రత్త పడ్డారు. అదే తరహాలో జేఈఈలు ఏడుగురు ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరిలో ముగ్గురు స్థాన చలనం పొందారు. మిగిలిన వారు పలు కేటగిరీల కింద పాత స్థానాల్లోనే ఉండిపోయారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలు నాయక్

ఉన్నత నిర్ణయం..!

ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థులకు తీపికబురు

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం కసరత్తు

సచివాలయ ఉద్యోగులకు సర్వే బాధ్యతలు

2023-24లో మూడు విడతలు పెండింగ్







అనంతపురం సెంట్రల్, మే 27(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను కొత్త ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బు చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. దీంతో వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చనుంది. గత ప్రభుత్వం బకాయి పెట్టిన వాటిని చెల్లించేందుకు ముందుకు రావడం ఎంతో ఉన్నత నిర్ణయం అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో మూడు విడతల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఆ మేరకు సర్వేకి సైతం శ్రీకారం చుట్టింది. సర్వే బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది.

24 నుంచి సర్వే

కళాశాలకు చెల్లించాల్సిన ఫీజులు, సర్టిఫికెట్లకు సంబంధంలేకుండా ఇప్పటికే విద్యార్థులకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ తదితర కోర్సులు చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కళాశాలల ఖాతాలకే జమచేసే పద్ధతి ప్రవేశపెట్టింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన ఫీజు బకాయిలను చెల్లించేలా కసరత్తు చేపట్టింది. 2023-24 విద్యా సంవత్సరానికి సబంధించిన నాలుగు విడతల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో మూడు విడతలను గత ప్రభుత్వం బకాయిపెట్టింది. దీంతో విద్యార్థులే సొంతంగా కళాశాలలకు ఫీజులు కట్టారు. ఇలా 2, 3, 4 విడతలకు సంబంధించిన ఫీజులు కట్టిన విద్యార్థులు ఎంతమంది ఉన్నారు? కళాశాలలకు ఫీజులు చెల్లించినట్లు రసీదులేమైనా పొందారా? ఫీజులుకట్టి బిల్లులు పొందని వారెంతమంది? ఉన్నారన్న అంశాలపై ఈనెల 24వ తేదీ నుంచి (మిగతా 4లో)

శారదాలో సందడి..!

బదిలీలు.. ప్రమోషన్‌లకు క్యూ



వెరిఫికేషన్‌కు వచ్చిన ఉపాధ్యాయులు

సర్టిఫికెట్లు, ఎస్ఆర్‌లు పరిశీలిస్తున్న స్క్రూటినీ కమిటీ సభ్యులు

అనంతపురం విద్య, మే 27(ఆంధ్రజ్యోతి): బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియతో ఉపాధ్యాయులల్లో సందడి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియకు అనంతపురం శారదా స్కూల్ వేదిక అయింది. వందలాది మంది టీచర్లు, సంఘాల నేతలతో శాదరా స్కూల్ ప్రాంగణం మంగళవారం కిటకిటలాడింది. గ్రీవెన్సులు, ఫిర్యాదులు, వేకెన్సీలు.. ఇలా అనేక సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు క్యూ కట్టారు. ఉమ్మడి జిల్లాలోని పీఎస్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ ప్రమోషన్లు ఇచ్చేందుకు మంగళవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యంలో 3 పోస్టులు, జడ్పీలో 120 పోస్టులు, మున్సిపాలిటీల్లో 20 పోస్టులు, మున్సిపల్ కార్పొరేషన్‌లో 5 పోస్టులకు (ప్రమోషన్ల కోసం) అర్హులైన పీఎస్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లను 1:3 చొప్పున సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఆహ్వానించారు. ప్రభుత్వ యాజమాన్యంలో ఖాళీగా ఉన్న 3 పోస్టులకు కడపలో వెరిఫికేషన్ నిర్వహించారు. మిగిలిన 145 పోస్టులకు శారదాస్కూల్‌లో 7 కౌంటర్లలో వెరిఫికేషన్ నిర్వహించారు. వెరిఫికేషన్ కమిటీలోని ఏడీలు, సూపరింటెండెంట్లు, మిగతా 4లో

మార్కెటింగ్ శాఖలో బదిలీలు

అనంతపురం రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల బదిలీలు మంగళవారం జరిగాయి. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 23 మంది, ఐదేళ్లు పూర్తి కాని 22 మంది కలిపి మొత్తం 45 మందిని బదిలీ జాబితాలో చేర్చారు. వీరికి గుంటూరులోని మార్కెటింగ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఉద్యోగుల బదిలీ ప్రక్రియ మంగళవారం రాత్రి పది గంటలకు పూర్తి అయింది. బదిలీల వివరాలు రెండు మూడురోజుల్లో వెలువడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

31నే పింఛన్ పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, మే 27(ఆంధ్రజ్యోతి): జూన్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును ఈనెల 31వ తేదీనే పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ శైలజ వేర్వేరు ప్రకటనల్లో మంగళవారం తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్‌దారులఇంటి వద్దనే అందజేస్తారన్నారు. జూన్ 1వ తేదీన ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. జూన్ నెలకు సంబంధించి జిల్లాలో 2,77,834 మంది లబ్ధిదారులకు రూ.124 కోట్ల పింఛన్ నిధులు మంజూరు చేశారన్నారు మొదటిరోజే లబ్ధిదారులందరికీ పింఛన్ పంపిణీ చేస్తారన్నారు. సాంకేతిక కారణాలు తలెత్తితే రెండోరోజు ఆదివారం అందజేస్తారన్నారు. మూడోరోజు సోమవారం ఆయా గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ పూర్తి చేస్తారని కలెక్టర్, పీడీ వివరించారు.

కదలకుండా.. కుతంత్రం..!

బదిలీల్లో లబ్ధికి ఎన్‌సీసీ సాకు

యూనిట్ లేనిచోటా మాయలు

అధికారులు కట్టడి చేసేరా..?

అనంతపురం విద్య, మే 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల నేపథ్యంలో తమ పోస్టులు, స్థానాలను కాపాడుకునేందుకు కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. లేనివి ఉన్నట్లు.. ఉన్నవి లేనట్లు జిమ్మిక్కులు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ఎన్‌సీసీ యూనిట్ ఉన్న పాఠశాలల్లో శిక్షణ ఇచ్చే కొందరు పైరవీలకు దిగారు. అనంతపురంలోని రెండు పాఠశాలల్లో ఎన్‌సీసీ ట్రైనర్‌లకు ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయ్యింది. ఇప్పుడు తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. కానీ సంఘాల నాయకులను పట్టుకుని, అధికారులకు కాసులు ఎరవేసి పోస్టులను కాపాడుకోడానికి ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరో పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ లేదు. భవిష్యత్తులో యూనిట్ వస్తుందని.. ఇప్పటి బదిలీల్లో తమకు అనుకూలంగా ఉండే టీచర్‌కు పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారాల్లో కొందరు హెచ్‌ఎంలు, అధికారులు అండగా ఉన్నట్లు తెలిసింది.

ఎన్‌సీసీ యూనిట్ ఉంటే..

రాష్ట్రంలోని కొన్ని ఎంపిక చేసిన పాఠశాలల్లో ఎన్‌సీసీ యూనిట్ ఉంటుంది. అక్కడ విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ ఇస్తూ, క్యాంపులు నిర్వహించే ఉపాధ్యాయులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు. వారికి మినహాయింపులు ఉంటాయి. ఎన్‌సీసీ యూనిట్ ఉన్న పాఠశాల్లోనే వారికి పోస్టింగ్ ఇస్తారు. అలాంటి ఖాళీలు లేకుంటే, వారి అభ్యర్థన మేరకు పనిచేస్తున్న పాఠశాలలోనే ఉండే అవకాశం కల్పిస్తారు. కానీ తాజా బదిలీల్లో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయిన టీచర్లకు బదిలీ తప్పనిసరి అన్న నిబంధన ఉంది. ఈ నిబంధన నుంచి తప్పించుకునేందుకు అనంతపురంలోని కొన్ని ఎన్‌సీసీ పాఠశాలల్లో పనిచేసే టీచర్లు కొందరు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

కదలకుండా ఉండాలని..

అనంతపురంలోని పొట్టి శ్రీరాములు, శారద నగరపాలక ఉన్నత పాఠశాలలు, కేఎస్ఆర్ హైస్కూల్, న్యూటౌన్ బాలుర పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్లు ఉన్నాయి. అక్కడ పనిచేసే టీచర్లకు బదిలీల్లో ప్రాధాన్యం ఉంటుంది. కానీ కొత్త నిబంధనల మేరకు ఎనిమిదేళ్లు పూర్తయినవారు కదలక తప్పదు. ఇది ఎన్‌సీసీ మాస్టర్లలో కొందరికి మింగుడు పడటం లేదు. అనంతపురం మొదటి రోడ్డులో ఉండే పాఠశాలలో పనిచేసే టీచర్, కలెక్టరేట్ సమీపంలోని మరో స్కూల్‌లో పనిచేసే టీచర్‌కు ఇప్పటికే ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయినట్లు సమాచారం. వీరు ఎలాగైనా అక్కడే కొనసాగాలని పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఆ దిశగా కొందరు సంఘాల నాయకుల ద్వారా అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారని సమాచారం.



ఎన్‌సీసీ యూనిట్ ఉన్న స్కూల్ (ఫైల్)

యూనిట్ లేకున్నా..

పాతూరులోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఇప్పటి వరకూ ఎన్‌సీసీ యూనిట్ లేదు. యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. దీనిపై నిర్ణయం వెలువడకనే ఆశావహ టీచర్, మరో హెచ్ఎం బదిలీల్లో ఎన్‌సీసీ యూనిట్‌ను చూపించి లబ్ధిపొందాలని చూస్తున్నట్లు తెలిసింది. అప్పటికే యూనిట్ ఉండి, సుమారు రెండేళ్ల పాటు ఎన్‌సీసీ క్యాంపులు, ఇతర కార్యక్రమాలు నిర్వహించిన వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే ఇక్కడ యూనిట్ రాకనే పోస్టు కాపాడుకునేందుకు పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరికి కొందరు విద్యాశాఖ అధికారులు అండగా ఉన్నారని తెలిసింది. బదిలీల సమయంలో ఎన్‌సీసీ యూనిట్ పేరుతో అడ్డదారులు తొక్కుతున్నవారిని జిల్లా విద్యాశాఖ, కమిషనరేట్ అధికారులు దారిలో పెట్టాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు అంటున్నారు.

బ్యాంకర్స్ పేరుతో బురిడీ

విస్తారంగా వర్షాలు

వివరాలు 4లో

దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది.. టీడీపీనే..

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ● మహానాడు వేదికపై ప్రసంగం



బుక్కరాయసముద్రం, మే 27(ఆన్‌లైన్): సమాజంలో దళితులు అన్నిరంగాల్లో అవమానాలు ఎదుర్కొని, ఆర్థికంగా చితికిపోయిన సమయంలో వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది టీడీపీనేనని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. కడపలో నిర్వహిస్తున్న మహానాడు తొలిరోజు మంగళవారం దళిత సంక్షేమం, అభివృద్ధికి టీడీపీ అమలు చేస్తున్న పథకాల తీర్మానంపై శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి ప్రసంగించే అవకాశం కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దళితుల సంక్షేమానికి టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఎనలేని కృషి చేశారన్నారు. దానిని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. కొనసాగిస్తున్నారన్నారు. దళితల కోసం 27కిపైగా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద గతంలో రూ.40 వేల కోట్లు కేటాయించి, దళితులు ఆర్థికంగా ఎదగడానికి, దళిత వాడల్లో సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌ను 14 నుంచి 15శాతానికి పెంచారన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య, స్వయం ఉపాధి కింద రుణాలు, భూమిలేని నిరుపేద దళిత కుటుంబాలకు భూమి కొనగోలు, సున్నావడ్డీ, కులాంతర వివాహాలకు రూ.75వేలు, రైతు రథం, ఏపీ స్టడీ సర్కిల్ ద్వారా దళిత విద్యార్థులకు ఉన్నత బోధనతోపాటు తదితర పథకాలతో దళితులకు దన్నుగా నిలిచిందన్నారు. వైసీపీ హయాంలో దళితలకు రక్షణ కరువైందన్నారు. వందలమంది దళితులపై దాడులు, హత్యలు, బెదిరింపులతో వైసీపీ నేతలు అరాచకాలు చేశారని ఆరోపించారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితలు.. వైసీపీకి వ్యతిరేకంగా ఓట్లు వేసి, ప్రజా తీర్పు ఇచ్చారన్నారు. రానున్న నాలుగేళ్ల పాలనలో దళితుల సంక్షేమానికి విశేష కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.

మండలాల వారీగా విత్తన కేటాయింపు

అనంతపురం అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మండలాలవారీగా విత్తన వేరుశనగను కేటాయించారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు జిల్లాకు 50,592 క్వింటాళ్ల విత్తన వేరుశనగను కేటాయించారు. ఇందులో కే-6 రకం 46,692 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి 900, టీసీజీఎస్ - 1694 రకం 3 వేల క్వింటాళ్లు ఇవ్వనున్నారు.

కేటాయింపులిలా..

అత్యధికంగా గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాలకు 3వేల క్వింటాళ్ల చొప్పున కేటాయించారు. బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, గుత్తి 2,900, శెట్టూరు 2,800, గుంతకల్లు 2,500, కుందుర్పి 2,600, ఆత్మకూరు, కూడేరు, రాప్తాడు, కణేకల్లు 2,100, వజ్రకరూరు, కంబదూరు 2,000, ఉరవకొండ 1,700, అనంతపురం, డి.హిరేహాళ్, నార్పల 1,600, బుక్కరాయసముద్రం 1,500, శింగనమల 1,400, బెలుగుప్ప 1,262, పామిడి 1,200, గార్లదిన్నె 1,100, యాడికి 850, విడపనకల్లు 650, బ్రహ్మసముద్రం 500, పెద్దవడుగూరు 400, పెద్దపప్పూరు 100, తాడిపత్రి 80, పుట్లూరు 50 క్వింటాళ్లు కేటాయించారు. యల్లనూరు మండలానికి విత్తన వేరుశనగ కేటాయించలేదు.



దేశ రక్షణ కోసమే బజరంగ్‌దళ్

జాతీయ కన్వీనర్ నీరజ్ దోనేరియా

అనంతపురం కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి): దేశ, ధర్మ రక్షణ కోసమే బజరంగ్ దళ్ పనిచేస్తోందని జాతీయ కన్వీనర్ నీరజ్ దోనేరియా పేర్కొన్నారు. హిందూ సమాజాన్ని సంఘటితంగా మారుస్తూ, యువతలో దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించడమే లక్ష్యమన్నారు. నగర పరిసర ప్రాంతమైన వడియంపేట వద్దగల కేశవరెడ్డి పాఠశాలలో మంగళవారం రాష్ట్ర స్థాయి బజరంగ్‌దళ్ శిక్షణా తరగతులను ప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమయ్య ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు ఏడురోజులపాటు సాగనున్నాయి. తొలిరోజు కార్యక్రమానికి నీరజ్ దోనేరియా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణా తరగతులు దేశ, ధర్మ, ఆలయ, గోవు, కన్య, హిందూ సంస్కృతి పరిరక్షణకు దోహదపడతాయన్నారు. యువతలో దేశభక్తి, సేవ, సురక్ష, సంస్కారం అనే నాలుగు మూలాలపై చైతన్యం కలిగించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఉభయ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి తనికెళ్ల సత్యరవి కుమార్, బజరంగ్ దళ్ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ వీర కుమార్‌స్వామి, పోలేపల్లి సందీప్, కసాపురం రవి, జిల్లా కార్యదర్శి విశ్వనాథరెడ్డి, సహాయ కార్యదర్శి బొబ్బ కిషోర్‌నాయుడు, జిల్లా కన్వీనర్ సురేంద్రబాబు, ఉపాధ్యక్షుడు కోనేటి రమణబాబు, జిల్లా గోరక్ష ప్రముఖ్ గుర్రం సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బజరంగ్‌దళ్ జాతీయ కన్వీనర్

రాష్ట్రపండుగలా నేడు ఎన్టీఆర్ జయంతి: డీఆర్వో

అనంతపురం టౌన్, మే27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతిని రాష్ట్రపండుగలా అధికారికంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మలోల మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోనూ బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో వేడుకలు కొనసాగుతాయన్నారు. జిల్లా అధికారులు, అనధికారులు, ప్రజాప్రతినిధులు, కళాకారులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.



మహానాడు సంబరం





కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.



ఉన్నత నిర్ణయం..!

(3వ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఏ విద్యార్థీ నష్టపోకుండా వారంరోజుల్లో పూర్తిచేయాలని సర్వే బాధ్యతను సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది. దీంతో దాదాపు 42వేల మంది విద్యార్థులు లబ్ధిపొందనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత శాఖ లెక్కలు చెబుతున్నాయి.



జేఎన్‌టీయూ ముఖద్వారం

నాలుగేళ్లు ఇబ్బందులు..

డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, అగ్రికల్చర్, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ ఇలా ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వమే కళాశాలల ఫీజులను రీయింబర్స్ చేస్తుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం ప్రవేశ పెట్టినప్పట్నుంచి కళాశాలల ఖాతాలకే నేరుగా రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది. కళాశాలలతో తమకు సంబంధంలేదన్న తరహాలో ఫీజుల అంశాన్ని గత ప్రభుత్వం విద్యార్థులకు ముడిపెట్టింది. ఏడాది ఫీజును నాలుగు విడతలుగా విభజించి విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేసేది. దీంతో తల్లుల ఖాతాల్లోకి రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను జమచేయకున్నా.. విద్యార్థుల తల్లిదండ్రులే వారి జేబుల నుంచి ఫీజులు చెల్లిస్తూవచ్చారు. పరీక్ష ఫీజులు కట్టించుకోవాలన్నా, హాల్ టిక్కెట్లు ఇవ్వాలన్నా, సర్టిఫికెట్లు ఇవ్వాలన్నా సంబంధిత విద్యార్థి కోర్సు ఫీజు మొత్తాన్ని చెల్లించాల్సి వచ్చేది. ఇలా నాలుగు సంవత్సరాలపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు.

విద్యార్థులకా.. కళాశాలలకా...

ప్రైవేటు, ప్రభుత్వం అన్న తేడాలేకుండా విద్యార్థుల ముక్కుపిండి కళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేశాయి. సిఫార్సులున్న కొద్దిమంది విద్యార్థులకు మాత్రమే మినహాయింపు ఇచ్చాయి. అందులోనూ సిఫార్సులు చేసిన వారిని షూరిటీగా పెట్టుకుని ఫలానా తేదీ చెల్లిస్తామని హామీ తీసుకుని వెసులుబాటు కల్పించాయి. దీంతో దాదాపు 90 శాతం మంది విద్యార్థులు సొంతంగా ఫీజులు కట్టుకున్నారు. ఈ క్రమంలో సర్వే అనంతరం మూడు విడుతల బకాయి మొత్తాన్ని విద్యార్థులకు చెల్లించాలా? కళాశాలలకు ఇవ్వాలా? అన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. నివేదికలు వచ్చిన తరువాత విద్యార్థులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందన్న ఆలోచనలో ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రతి విద్యార్థీ సర్వే చేయించుకోవాలి

2023-24లో ఫీజు రీయింబర్స్ మొత్తాలు అందని ప్రతి విద్యార్థీ వీలైనంత త్వరగా సమీపంలోని సచివాలయానికెళ్లి సర్వే చేయించుకోవాలి. ఒకటో విడత ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాలను చెల్లించారు. మిగిలిన 2, 3, 4 విడతలకు సబంధించిన బకాయిలను చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది. తద్వారా డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, అగ్రికల్చర్, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ ఇలా ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించే దాదాపు 42వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఇందుకు కళాశాలకు చెల్లించిన ఫీజు రసీదులను సచివాలయంలో అప్‌లోడ్ చేయించాలి. రసీదులు లేకపోతే కళాశాల నుంచి నోడ్యూ సర్టిఫికెట్ తీసుకుని, అప్‌లోడ్ చేయాలి. సచివాలయ వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీనిగానీ సంక్షేమం, విద్యా సహాయకులను గానీ సంప్రదించాలి.



- రాధిక, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి

సర్వే విధానం..

- 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత ఫీజు రీయింబర్స్‌మెంట్ వివరాలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉండదు. 2, 3, 4 విడతలకు సబంధించి విద్యార్థుల నుంచి కళాశాల యాజమాన్యం వసూలు చేసిన రుసుముల రసీదులను మాత్రమే అప్‌లోడ్ చేయాలి.
- ఫీజుల రసీదులను విద్యార్థి అందించలేకపోతే కళాశాల నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తీసుకుని అప్‌లోడ్ చేయాలి.
- విద్యార్థి ఫీజు వివరాలను సచివాలయ వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీనిగానీ సంక్షేమం, విద్యా సహాయకులుగానీ పరిశీలించాలి.
- ఈ ప్రక్రియ సంబంధిత సచివాలయ ఉద్యోగులు సక్రమంగా పూర్తిచేయవలసి ఉంటుంది. తద్వారా ప్రభుత్వపరంగా ఆడిట్‌గానీ, సాంకేతిక సమస్యలుగానీ తలెత్తవు.

విస్తారంగా వర్షాలు

బుక్కరాయసముద్రం, మే 27(ఆన్‌లైన్): నైరుతి రుతు పవనాల ప్రభావం, అల్పపీడన ద్రోణి కారణంగా ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి మంగళవారం తెలిపారు. తేలికపాటి నుంచి 12 మి.మీ. వరకు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. గాలి వేగం 16 కి.మీ. నుంచి 20 కి.మీ. ఉంటుందని తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 29.2 డిగ్రీల సెల్సియస్ నుంచి 31.2 డిగ్రీల సెల్సియస్ నమోదవుతాయని తెలిపారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంటలకు మందులు పిచికారీ చేయవద్దని సూచించారు.

16 మండలాల్లో..

అనంతపురం అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 16 మండలాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా యాడికిలో 19.0 మి.మీ, వర్షపాతం నమోదైంది. గుత్తి 17.0, పెద్దవడుగూరు 7.8, తాడిపత్రి 6.4, పామిడి 4.6, గుంతకల్లు, పెద్దపప్పూరు 4.2, కుందుర్పి 3.6, కళ్యాణదుర్గం 3.4, డి. హిరేహాళ్ 3.0, ఉరవకొండ 2.2 మి.మీ, వర్షపాతం కురిసింది. మిగతా మండలాల్లో 1.8 మి.మీ, లోపు నమోదైంది.

బ్యాంకర్స్ పేరుతో బురిడీ

గార్లదిన్నె, మే 27(ఆంధ్రజ్యోతి): తాము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, మీకు ముద్ర రుణం రూ.2 లక్షలు మంజూరు చేస్తాం. ప్రస్తుతం మీరు రూ.33వేలు ఈ నెంబరుకు ఫోన్‌పే చేయండి అని మోసగించిన ఉదంతం మండలంలో జరిగింది. గార్లదిన్నెలో హోటల్ నిర్వహిస్తున్న ఓ మహిళాకు ఈనెల 23న మధ్యాహ్నం ఓ నెంబరు నుంచి ఫోన్ వచ్చింది. తాము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం. మీరు ముద్ర రుణం పొందడానికి అర్హులయ్యారని నమ్మించారు. దీంతో ఆశ పడిన ఆ మహిళా రుణం ఎప్పుడు మంజూరు చేస్తారు సార్ అని అడిగారు. ముద్ర రుణం మంజూరు చేయాలంటే కొంత ప్రాసెస్ ఉంది.. ప్రాసెస్ చేయాలంటే కొంత ఖర్చు అవుతుందన్నారు. ముద్రరుణం మంజూరు చేయాలంటే డిపాజిట్ రూ.10వేలు, బీమా రూ. 10వేలు, బాండు ఫీజు రూ. 3వేలు ఖర్చు అవుతుంది. మా నెంబరుకు ఫోన్‌పే చేస్తే వెంటనే ముద్ర రుణం మంజూరు చేసి, మీ ఖాతాలోకి జమ చేస్తామని నమ్మించారు. వారి మాటలను నమ్మిన మహిళా వెంటనే వారు చెప్పిన నెంబరుకు ఫోన్‌పే చేసింది. మీకు రూ.2 లక్షలు మంజూరు చేస్తున్నాం. మాకు కమీషన్ కింద రూ. 10వేలు ఇవ్వాలన్నారు. సరే అని మరో రూ.10వేలు మొత్తం రూ. 33వేలు ఫోన్‌పే చేశారు. తర్వాత వారు బ్యాంకు సమయం అయిపోయింది. సోమవారం మీ ఖాతాలోకి డబ్బులు జమ చేస్తామని చెప్పారు. దీంతో బాధిత మహిళ సోమవారం బ్యాంకుకు వెళ్లి చూడగా ఎలాంటి డబ్బు జమకాలేదు. దీంతో తనకు ఫోన్ చేసిన నెంబరుకు ఫోన్‌చేయగా అది పనిచేయలేదు. దీంతో తాను మోసపోయానని బాధిత మహిళ బోరుమని విలపించింది.

శారదాలో సందడి..!



టీచర్ల సమస్యలపై డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న టీచర్లు, నేతలు

(3వ పేజీ తరువాయి)

ఎంఈఓ, డీఈఓ ఆఫీస్ స్టాఫ్ స్క్రూటినీ చేశారు.

దరఖాస్తు చేయని 376 మంది ఎస్‌జీటీలు

ఎనిమిదేళ్లు ఒకే చోట పనిచేసిన టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. ఈ జాబితాలోని ఎస్‌జీటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం ఆఖరి రోజు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 376 మంది ఎస్‌జీటీలు దరఖాస్తు చేయలేదు. రాయలసీమ జోన్‌లో ఇతర జిల్లాల్లో దరఖాస్తు చేయని ఎస్‌జీటీలు 100లోపు ఉంటే, అనంతపురంలో ఏకంగా 376 మంది ఉన్నారు. కంపల్సరీ బదిలీ టీచర్లు తప్పనిసరిగా దరఖాస్తు చేయాలని ఆర్‌జేడీ శామ్యూల్, డీఈఓ ప్రసాద్‌బాబు హెచ్చరిస్తున్నా కొందరు టీచర్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

న్యూస్ బాక్స్

జైలును తనిఖీ చేసిన న్యాయాధికారి



సమస్యలు తెలుసుకుంటున్న న్యాయాధికారి రాజశేఖర్

అనంతపురం క్రైం, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లా జైలును, ఓపెనర్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎస్ రాజశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. అక్కడ ఉన్న సదుపాయాలతో పాటు అందుతున్న వైద్య సేవలు, సమస్యలపై ఆరా తీశారు. ఖైదీలకు న్యాయ సలహాలు, వారికి అందుతున్న న్యాయ సేవల గురించి వివరించారు. జైలు ఆవరణాన్ని పరిశీలించారు.

రేషన్ షాపు వద్దే సరుకుల పంపిణీ: తహసీల్దార్

రాప్తాడు, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నుంచి ప్రతి నెలా స్టోర్ డీలర్ల వద్దే రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ విజయకుమారి, సీఎస్‌డీటీ జ్యోతి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు.

మైనర్ ఇరిగేషన్ డిప్యూటీ ఎస్‌ఈగా పార్థసారధి

అనంతపురం క్లాక్‌టవర్, మే 27(ఆంధ్రజ్యోతి): మైనర్ ఇరిగేషన్ డిప్యూటీ ఎస్‌ఈగా పార్థసారధి నియమితులయ్యారు. కడపలో జీఎన్‌ఎస్‌ఎస్‌లో డీఈగా పనిచేస్తున్న పార్థసారధికి పదోన్నతి కల్పిస్తూ ఇక్కడికి బదిలీ చేశారు. మైనర్ ఇరిగేషన్‌లో మూడు నెలలుగా ఖాళీగా ఉన్న డిప్యూటీ ఎస్ఈ స్థానంలో పార్థసారధి బాధ్యతలు స్వీకరించారు.

పర్యావరణ దినాన్ని విజయవంతం చేయాలి: డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 5 మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చూడాలని డీఎఫ్ఓ విఘ్నేష్ సిబ్బందికి సూచించారు. ఆ రోజు ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై మంగళవారం ఆయన రేంజర్లు శ్రీనివాసులు, మధుబాబుతో కలిసి పంపనూరు నగరవనంలో చర్చించారు. అక్కడ చేపట్టాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారు.

టీఎన్ఎస్ఎఫ్ నాయకుడిపై కేసు కొట్టివేత

అనంతపురం విద్య, మే 27(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తనపై, టీడీపీ నేతలపై పెట్టించిన అక్రమ కేసులను కోర్టు కొట్టివేసినట్లు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం పేర్కొన్నారు. జిల్లా అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మంగళవారం కేసును కొట్టివేసినట్టు తెలిపారు. తాను టీడీపీ పరిటాల కుటుంబం వద్ద ఉన్నానన్న అక్కసుతో గత వైసీపీ ప్రభుత్వంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని, తనపై, మరో ఇద్దరిపై కేసులు పెట్టించారన్నారు. 2023లో ఆత్మకూరు మండల పోలీస్‌స్టేషన్‌లో తనతో పాటు, టీడీపీ ఆత్మకూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మయ్య, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు బాల ఉజ్జినప్పపై కేసులు పెట్టించారన్నారు. కోర్టు ఆ కేసులను కొట్టివేసిందన్నారు.

యోగాపై శిక్షణ ప్రారంభం



యోగా చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గార్లదిన్నె, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఏఓ బాబా ఫక్రుద్దీన్, ఏపీఓ ఓబన్న, రామాంజి తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక మర్తాడు క్రాస్ వద్ద టీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం మెగా యోగా ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయం, మహిళా సంఘాల లీడర్లు, సభ్యులతో పాటు ఆసక్తి ఉన్న వారు హజరు కావాలన్నారు.

అలరించిన పౌరాణిక నాటకం

అనంతపురం కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతిని పురస్కరించుకుని ఏపీ సృజనాత్మక, సాంస్కృతిక సమితి సహకారంతో సత్యసాయిబాబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. స్థానిక కృష్ణకళామందిర్‌లో నిర్వహించిన సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన వీక్షకులను ఎంతగానో అలరించింది. నాటకంలో హరిశ్చంద్రుడిగా గోపాల్ నాయుడు, చంద్రమతిగా కృష్ణవేణి, విశ్వామిత్రుడిగా కేబీ నాగప్ప తదితర కళాకారులు తమదైనశైలిలో నటనా పాటవాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాటకోత్సవ సమితి అధ్యక్షుడు మైకేల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

● ఐసీడీఎస్ పీడీ నాగమణి

నార్పల, మే 27(ఆంధ్రజ్యోతి): బాలికలు తప్పక పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ నాగమణి పేర్కొన్నారు. మండల కేంద్రమైన నార్పలలోని చింతవనం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాసం నాలుగో విడత కార్యక్రమాన్ని సీడీపీఓ భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అన్నారు. అలాగే యోగా కార్యక్రమంపై ఆయాలకు అవగాహన కల్పించి యోగా ఆసనాలు చేయించారు. అనంతరం కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శైలజారాణి, ఆరోగ్య సూపర్‌వైజర్ అక్కులప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునాలిని, మధుమాలిని, టీపీసీ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు విమల, లక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నాక్లయింట్ అయిన పుల్లా భీమన్న, S/o Late P.ఆంజినేయులు, D.No.4/234, రెండవ రోడ్డు, అనంతపురం టౌన్, అనంత పురం జిల్లా చెందిన అనంత పురం గ్రామ పొలము సర్వే నెం. 199/5A మరియు 200/3 ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 5200/2007 మరియు 5201/2007,తేది:11-04-2007,19-03-2025వ తేదీన ఇంటి నుంచి APSRTC బస్టాండ్‌కు వెళ్ళుచున్న సందర్భముగా ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయినది.దొరికిన వారు నాకు కానీ నా క్లయింట్‌కు కానీ తెలుపగలరు.

Smt.S.BalaTriveni,Advocate
Adoni,Cell No: 9246577201

యోగా చేయండి.. ఆరోగ్యంగా ఉండండి

● నోడల్ అధికారి డీఎంహెచ్ఓ ఈబీ దేవి
● జిల్లా కేంద్రంలో భారీ అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు

అనంతపురం టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యోగాంధ్ర క్యాంపెయిన్ నోడల్ ఆఫీసర్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి పిలుపునిచ్చారు. యోగాంధ్ర క్యాంపియన్‌లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా యంత్రాంగం తరపున బారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాల వద్ద ర్యాలీని డీఎంహెచ్ఓ ప్రారంభించారు. అక్కడి నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్ మీదుగా తిరిగి ఆర్ట్స్ కళాశాల వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో యోగాంధ్ర క్యాంపెయిన్ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి వచ్చే నెల జూన్ 21 వరకు జిల్లా వ్యాప్తంగా యోగా శిక్షణా తరగతులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆయుష్ జిల్లా అధికారి డాక్టర్ రాంకుమార్, డాక్టర్ లాల్యానాయక్, ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, యోగా గురువులు గురురాజారావు, కృష్ణవేణి, చలపతి, డీపీఆర్ఓ గురుస్వామి శెట్టి, డెమోలు త్యాగరాజు, గంగాధర్, కిరణ్, ఐఎంఏ నాయకులు డాక్టర్ మురళీక్రిష్ణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మజతో పాటు పెద్దఎత్తున ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

కందుకూరికి ఘన నివాళి



కందుకూరి వీరేశలింగం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో చోటు చేసుకున్న మూఢవిశ్వాసాలను నిర్మూలించేందుకు కందుకూరి వీరేశలింగం పంతులు జీవితాన్ని, ఆయన రచనలను మనం చదవాలని తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని పేర్కొన్నారు. నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 106వ వర్ధంతిని మంగళవారం తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విశాలాంధ్ర బుక్ హౌస్‌లో నిర్వహించారు. వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీకారులు కృష్ణమూర్తి, డాక్టర్ అంకె రామలింగయ్య, కోగిర జయచంద్ర, తోట నాగరాజు, ఏజీ అనీల్‌కుమార్, ఎర్రగుంట కృష్ణారెడ్డి, షేక్ రియాజుద్దీన్, గంగిరెడ్డి విశ్వనాథరెడ్డి, సుంకర రమేష్, శేషాద్రి శేఖర్, పరమేశ్వరరావు, సాంబశివుడు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు కనిపించవా..?

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, మే 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రైతుల కష్టాలు టీడీపీ ప్రజాప్రతినిధులకు కన్పించడం లేదా..? అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రజాప్రతినిధులు తమ స్వార్థం, స్వప్రయోజనాలను వీడి ఉమ్మడి జిల్లా రైతాంగాన్ని ఆదుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా అన్నదాతల గురించి పట్టించుకునే నాథులే కరువయ్యారని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో రైతులకు పెట్టుబడి సాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏటా రూ. 13,500 అందజేశాయన్నారు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20వేలు అందిస్తామని, మరో ఖరీఫ్ సమీపిస్తున్నా రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లా రైతుల కష్టాలు తీర్చే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

శిశువుల మరణాలపై విచారణకు కమిటీ

● ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో శిశువుల మరణాలపై విచారణకు ప్రత్యేకంగా త్రిసభ్య కమిటీని నియమించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం జిల్లా ఆస్పత్రిలో 'ఒకే రోజు ముగ్గురు శిశువుల మరణం, బయటకు రాకుండా జాగ్రత్తలు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రధానంగా ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనంపై సూపరింటెండెంట్ సీరియస్‌గా స్పందించారు. ఇందులో నిజానిజాలు తేల్చడానికి డాక్టర్ నవీన్‌కుమార్(అనస్తీషియా), డాక్టర్ సతీష్ (ఆర్థో), డాక్టర్ రవికుమార్ (పీడియాట్రిక్)తో త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ కమిటీ విచారణచేసి నివేదికలు అందించిన తర్వాత ఆ మరణాలలో డాక్టర్ల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ తెలిపారు.

మూడేళ్లు పనిచేస్తే.. బదిలీ తప్పనిసరి..

వైద్యశాఖ ట్రాన్స్‌ఫర్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం

పనితీరు ఆధారంగా ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లకు స్థానచలనం

20 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు

అనంతపురం టౌన్, మే27(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అవినీతికి చెక్‌పెట్టడంతోపాటు వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బందిని గాడిలో పెట్టి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుతం ప్రత్యేకంగా బదిలీలు నిర్వహించుకోవడానికి ఆదేశాలు ఇచ్చింది. వైద్య కళాశాల, సర్వజనాస్పత్రి, జిల్లా వైద్యాధికారి కార్యాలయం, ఇతర ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బంది బదిలీల విషయంలో ప్రత్యేక నిబంధనలు పెట్టింది. ఒకేచోట మూడేళ్లు పనిచేస్తుంటే అధికారులు, పాలనాసహాయక సిబ్బందికి తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వైద్య శాఖలో అవినీతి ఆరోపణలు అధికంగా ఉండేవారిని తప్పకుండా అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్ కింద పనిష్మెంట్ ప్లేస్‌లకు పంపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లా వైద్యాధికారి డీసీహెచ్ఎస్, వైద్య కళాశాల, ఆస్పత్రుల సూపరింటెండెంట్లను పనితీరు ఆదారంగా తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. అందుకు 20రోజులు గడువు ఇవిధించింది. ఆలోగా బదిలీల పక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర వైద్యశాఖ కమిషనర్లకు ప్రభుత్వం మంగళవారం ఆదేశాలిచ్చింది. నిబంధనలు, మార్గదర్శకాలు ఈనెల 29వ తేదీలోగా జిల్లాకు చేరే అవకాశం ఉందని వైద్యవర్గాలు అంటున్నాయి.దీంతో జిల్లాలోని వైద్యశాఖ అధికారులు, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాల్, వైద్యసిబ్బంది, ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

మలేరియా విభాగానికి ఎంపీహెచ్‌ఏలు

అనంతపురం టౌన్, మే27(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఏల బదిలీలు ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న మొత్తం 215 మందిని మలేరియా విభాగానికి ప్రభుత్వం కేటాయించింది. వీరందరికీ మంగళవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పీహెచ్‌సీలకు పోస్టులు కేటయించారు. జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి, జిల్లా మలేరియా అధికారి ఓబులు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

అనంత ఆత్మబంధువు మన్రో

● రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ



థామస్ మన్రో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధికి కృషి చేసిన సర్ థామస్ మన్రో అనంత ఆత్మబంధువుగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ అన్నారు. మన్రో 264వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ కూడలి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మన్రో మెమోరియల్ ట్రస్టు చైర్మన్ తోట నాగరాజు, తెలుగు వెలుగు సంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, కేపీ రాజు, మహాబోధి సాహిత్య వేదిక అధ్యక్షుడు దాసన్నగారి కృష్ణమూర్తి, ఏజీ అనీల్ కుమార్, షేక్ రియాజుద్దీన్, అంకె రామలింగయ్య, కోగిర జయచంద్ర, భీమసేన్‌రావు, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలపై కఠిన చర్యలు

జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత

ఎమ్మార్పీ ఉల్లంఘన కేసుల్లో పరిహారం చెల్లించాలని ఆదేశాలు

అనంతపురం క్రైం, మే 27(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల నుంచి ఎమ్మార్పీ కన్నా అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని వినియోగదారుల న్యాయస్థానంలో మంగళవారం జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, సభ్యుడు గోపీనాథ్‌తో కూడిన ధర్మాసనం రెండు వేర్వేరు ఫిర్యాదుల్లో వినియోగదారుడికి పరిహారం చెల్లించటంతోపాటు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50వేలు చొప్పున చెల్లించాలని ఆదేశాలు జారీ చేయటం విశేషం. అనంతపురం పోస్టల్ శాఖ క్వార్టర్లలో నివసిస్తున్న రమేష్‌బాబు వినియోగదారుల న్యాయస్థానంలో రెండు వేర్వేరు ఫిర్యాదులు దాఖలు చేశారు. 2023 జూన్ 6న తన ద్విచక్ర వాహనం కోసం టర్న్ సిగ్నల్ ల్యాంప్‌ను రామచంద్రనగర్‌లోని ఒక ప్రైవేటు సంస్థలో కొనుగోలు చేశాడు. ప్యాక్‌పై ఎమ్మార్పీ రూ.143 మాత్రమే (అన్ని పన్నులతో కలిపి) అని ఉండగా.. బిల్లులో రూ.159 వసూలు చేశారని ఫిర్యాదుదారు నిరూపించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ వసూలు చేసిన కారణంగా ఫిర్యాదిదారుకు అదనంగా వసూలు చేసిన రూ.16 తిరిగి చెల్లించాలనీ, మానసిక వేధింపులకు పరిహారంగా రూ.10వేలు, న్యాయ ఖర్చుల కోసం రూ.3వేలు ఇవ్వాలని ఆదేశించింది. అదనపు జరిమానాగా రూ.50వేలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. రామచంద్రనగర్‌లోని ఒక దుకాణ సంస్థలో కొనుగోలు చేసిన ఓ కంపెనీ హ్యాండ్ వాష్ ధర రూ.60 ఉండగా.. రూ.68 వసూలు చేశారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. కంప్యూటర్‌లో నమోదైన ధరల ఆధారంగా వసూలు చేశామనీ, పాత కవర్ దాఖలు చేసి అక్రమార్జన కోసం అర్జీ దాఖలు చేస్తున్నారని సదరు సంస్థ బదులిచ్చింది. ఆధారాలన్నీ అధిక మొత్తాన్ని వసూలు చేసినట్లు రుజువు చేయడంతో ఫిర్యాదు దారునికి వసూలు చేసిన అధిక మొత్తాన్ని తిరిగి చెల్లించడంతో పాటు రూ.10వేలు, మానసిక వేదనకు రూ.3వేలు, చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. అదనంగా వసూలు చేసిన నేరం కింద రూ.50వేలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి చెల్లించాలని పేర్కొంది. ఈ రెండు ఫిర్యాదుల్లోనూ ప్రతివాదులు ఫిర్యాదు దారునికి నష్టపరిహారాన్ని చెల్లించినట్లుగా తెలియజేశారు. అదనంగా ముఖ్యమంత్రి సహాయనిధికి విధించిన మొత్తం లక్ష రూపాయలను వినియోగదారుల కమిషన్‌లో డిపాజిట్ చేశారనీ, ఆ మొత్తాన్ని సీఎంఆర్ఎఫ్‌కు అందజేస్తామని కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 34,120 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మొత్తం 612 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి



అబు సలామ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

విడపనకల్లు, మే 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరానికి చెందిన అబు సలామ్ (50) ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో మృతి చెందాడు. తన భార్య బీబీసారా, కూతుళ్లతో కలిసి బళ్లారిలో ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వారు ప్రయాణిస్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సును విడపనకల్లు వద్ద అల్పాహారానికి నిలిపారు. అప్పుడు అబుసలామ్‌కు గుండెపోటు రాగా ప్రయాణికులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మహానాడులో జిల్లా నాయకులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

కడపలో జరిగే మహానాడులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలిరోజు మంగళవారం పాల్గొని పసుపు పండుగను తిలకించారు.



మహానాడుకు హాజరైన ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరారెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు



మహానాడుకు హాజరైన ఎమ్మెల్యే దగ్గుపాటి, బండారు శ్రావణిశ్రీ



పరిటాల శ్రీరామ్



గౌస్‌మొద్దీన్, శ్రీధర్ చౌదరి, బుగ్గయ్య చౌదరి



దేవళ్ల మురళి, మాజీ మేయర్ స్వరూప, విశాలాక్షి



మహానాడులో నారా లోకేశ్‌తో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

ఇళ్ల వద్దకు సరుకుల పంపిణీని కొనసాగించాలి

● ఐద్వా, డీవైఎఫ్ఐ నాయకులు

అనంతపురం కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకు రేషన్ సరికులు పంపిణీ చేసే వ్యవస్థను రద్దు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కసాపురం రమేష్ మంగళవారం సంయుక్త ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 405 ఎండీయూ వాహనాలుండగా వీటిపై ఆధారపడి దాదాపు 800 మంది నిరుద్యోగులు ఉన్నారన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీ నిర్వహణలో లోపాలను సరిదిద్ది, ఎండీయూ వ్యవస్థను మరింత మెరుగు పరచాలన్నారు. అవినీతికి తావు లేకుండా కొత్త సాంకేతికతతో అనుసంధానం చేయాలని కోరారు. ఎండీయూ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇళ్లవద్దే బియ్యం అందించడం ఎంతో సౌకర్యంగా ఉండేదన్నారు. ఎండీయూ వాహనం వచ్చే సమయానికి కూలి పనులకు వెళ్లిన పేదలు తర్వాత రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకునేలా ఏర్పాటు చేయాలి తప్ప మొత్తం వ్యవస్థనే రద్దు చేయడం సబబు కాదన్నారు.

వేతనాలు చెల్లించకపోతే దశలవారీగా ఉద్యమం

● ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు కార్మికుల అల్టిమేటం

అనంతపురం టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): బకాయి ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సర్వజనాసుపత్రి పారిశుధ్య కార్మికులు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. న్యాయం చేయకపోతే దశలవారీగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకులు రాజేష్‌గౌడు, రాజు, ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు భార్గవి, ప్రశాంత్, లక్ష్మీదేవి, నాగరాజు తదితరులు మంగళవారం సూపరింటెండెంట్‌ను ఆయన చాంబర్ కలిసి వేతనాల సమస్యను విన్నవించారు.తమకు మూడునెలలుగా వేతనాలు ఇవ్వలేదని, తాము ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు వినతులు ఇచ్చామని, నిరసనలు తెలియజేశామని తెలిపారు. ఇప్పటికీ మూడు నెలల వేత నాలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. వెంటనే వేతనాలు అందేలా చూడాలని, లేదంటే ఉద్యమం చేయాల్సి వస్తుందని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు


పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి మంగళవారం అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, నిర్మాల్య విసర్జన, పంచామృతాభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. భక్తులు వందలాది మంది పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అన్నదానం నిర్వహించారు.

బైకు నుంచి పడి వ్యక్తి మృతి


హనుమంతరాయుడు (ఫైల్)

బెళుగుప్ప, మే 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంకంపల్లిలో సోమవారం రాత్రి ప్రమాదవశాత్తూ బైకుపై నుంచి పడి హనుమంతరాయుడు (35) మృతి చెందారు. గ్రామస్థులు, బంధువులు తెలిపిన మేరకు.. హనుమంతరాయుడు అంగడికి కావలసిన సరుకులను బైకు పై తీసుకెళుతుండగా కుక్క దారికి అడ్డంగా రావడంతో తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. టీడీపీలో చురుకుగా పనిచేసేవారని స్థానిక నాయకులు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక 26వ వార్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం 26వ వార్డులో ప్రజా పోరు యాత్రను నిర్వహించారు. వార్డుల్లో సీపీఎం నాయకులు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. జూన్ 2న మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సమస్యలపై సచివాలయ సిబ్బందికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి. శ్రీనివాసులు, మారుతిప్రసాద్, నాగరాజు, రమేష్, ఈరన్న, సర్వసతి పాల్గొన్నారు.

పెట్రోలు బంకుల్లో అక్రమాలపై విచారణ చేయాలి

గుంతకల్లుటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెట్రోలు బంకుల్లో జరుగుతున్న అక్రమాలపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బి.సురేష్ మాట్లాడుతూ.. పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ లీటర్‌కు తొమ్మిది పాయింట్లు వస్తున్నాయని తెలిపారు. ఆధునిక ఎలక్ట్రికల్ చిప్‌ను డిజిటల్ బోర్డుకు ఉపయోగించి ట్యాంపరింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నా తూనికలు, కొలతలు, పౌరసరఫర శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, రామాంజనేయులు, రామదాస్, నారాయణ, షేక్షావలి, జానయ్య, గోపి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కంబదూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైసీపల్లి శివారులో మంగళవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కళ్యాణదుర్గం సీఐ నీలకంఠేశ్వర్, ఏఎస్ఐ ఓబుళపతి ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడులు చేశారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద రూ. 26 వేల నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఉపాధి బిల్లులు పూర్తి చేయండి

కంబదూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా గతంలో ఇళ్ల నిర్మాణం చేపట్టి, ఉపాధి బిల్లులు అందని లబ్ధిదారులకు వెంటనే బిల్లులు పూర్తి చేయాలని ఎంపీడీవో సూర్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జ్ ఏపీవో ఉస్మాన్‌అలీతో పాటు సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు.

బీఎస్పీ నిరసన

గుత్తి, మే 27(ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులకు అరికట్టాలని బీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమంచేపట్టారు. తెనాలిలో దళిత యువకులను చితకబాదిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గద్దల నాగభూషణం, వెంకటకొండయ్య, విజయ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం

గుంతకల్లుటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యానేరమని డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం వెంకటేశ్వరి పేర్కొన్నారు. పట్టణంలోని అంథోనివీధి, మోదీనాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ వాడకం, బాల్యవివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

పర్మిట్ రూములను తొలగించాలి

విడపనకల్లు, మే 27(ఆన్‌లైన్): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో జనవాసాల మధ్య ఉన్న అనధికారిక పర్మిట్ రూములను తొలగించాలని బీసీ కాలనీ వాసులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులతో పాటు తహసీల్దార్ చంద్రశేఖరయ్య, ఎక్సైజ్ సీఐ రవిచంద్రకు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. విడపనకల్లు మండల కేంద్రంలో మద్యం దుకాణం పక్కనే అనధికారికంగా ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేసి మద్యం సేవిస్తుండడంతో కాలనీలో ఉన్న మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అనునిత్యం సాయంత్రం ఆరు గంటలు దాటితే... నడిరోడ్డు పక్కనే మద్యం సేవించి ఇష్టారాజ్యంగా మందుబాబులు నానా గొడవలు చేస్తున్నారని వాపోయారు. అనధికారికంగా వేసిన టెంట్లను తొలిగించాలని బీసీ కాలనీ వాసులు డిమాండ్ చేశారు.


పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీసీ కాలనీ వాసులు

బాలికతో వివాహం.. వివాదం

● భర్త వేధిస్తున్నాడని ఎస్పీని ఆశ్రయించిన బాధితురాలు
● కేసు నమోదు చేసిన పోలీసులు
● వయసు నిర్ధారణ కోసం ఆస్పత్రికి బాలిక..

రాయదుర్గం, మే 27(ఆంధ్రజ్యోతి): గుమ్మఘట్ట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను రామాంజనేయులు(45) అనే వ్యక్తి వివాహం చేసుకోవడం వివాదాస్పదమైంది. పెళ్లి తరువాత వేధిస్తుండటంతో బాలిక.. ఎస్పీ జగదీష్‌ను సోమవారం గ్రీవెన్స్‌లో ఆశ్రయించింది. దీంతో మైనర్‌ను వివాహం చేసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్పీ ఆదేశాల మేరకు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని సీఐ జయనాయక్ తెలిపారు. సీఐ తెలిపిన మేరకు, రాయదుర్గం పట్టణానికి చెందిన రామాంజనేయులుకు భార్య చనిపోయింది. దీంతో బాలికను ఈ ఏడాది ఏప్రిల్ 17న వివాహం చేసుకున్నాడు. బాలిక తల్లిదండ్రులకు వివాహానికి ముందు రూ.2 లక్షలదాకా ఎదురు కట్నం చెల్లించాడు. వివాహం జరిగిన తరువాత బాలికను మెట్టినింటికి సాగనంపారు. దాంపత్య జీవితంలో వేధిస్తున్నాడని బాలిక తల్లిదండ్రులకు పలుమార్లు తెలియజేసింది. పెళ్లయిన నెలరోజుల వ్యవధిలో రెండుసార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. రెండుసార్లు బాలికను బలవంతంగా కాపురానికి పంపించారు. రామాంజనేయులుతో ఉండడం ఇష్టంలేని బాలిక, మూడురోజుల క్రితం చెప్పాపెట్టకుండా వెళ్లిపోయింది. అతడు.. ఆమె కోసం గాలించాడు. బాలిక కనిపించలేదని ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు కూడా బాలిక కోసం వెతికారు. చివరకు ఆమె సోమవారం ఎస్పీని ఆశ్రయించి, ఫిర్యాదు చేసింది. విచారించి చర్యలు తీసుకోవాలని రాయదుర్గం పోలీసులను ఎస్పీ ఆదేశించారు. కేసు నమోదు చేసిన పోలీసులు రామాంజనేయులుతోపాటు బాలిక వయసు నిర్ధారణ కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలికకు సంబంధించి రెండు ఆధార్ కార్డులు ఉన్నాయని సమాచారం. ఒక ఆధార్‌లో 2007లో జన్మించినట్లు, మరో ఆధార్‌లో 2008లో జన్మించినట్లు నమోదు చేయించారని తెలిసింది. 2007 ఆధార్ కార్డు ఆధారంగా.. ఆమె మేజర్ కావడంతోనే తాను వివాహం చేసుకున్నానని, పెద్ద మనుషుల సమక్షంలో, అందరి ఆమోదంతోనే వివాహం చేసుకున్నానని రామాంజనేయులు వాదిస్తున్నాడు. డాక్టర్లు ఆమె వయసు నిర్ధారిస్తేగాని కేసు ముందుకు సాగదని పోలీసులు అంటున్నారు.

భూములను పరిశీలించిన కలెక్టర్


ధర్మవరం రోడ్డులో ఉన్న భూములను పరిశీలిస్తున్న కలెక్టర్

కళ్యాణదుర్గంరూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం కోసం అవసరమైన భూమిని గుర్తించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణ పరిధిలో విద్యాలయం కోసం అవసరమైన భూమిని ఆయన ఆర్డీవో వసంత్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఈ విద్యాలయం కోసం 30 ఎకరాల భూమి కావలసి వుండగా పట్టణంలోని ధర్మవరం రోడ్డులో ఉన్న సర్వే నెంబర్ 464లో ఉన్న 17.12 ఎకరాలను, సర్వే నెంబర్ 465లో ఉన్న 1.35 ఎకరాల భూమిని పరిశీలించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో, సర్వే అధికారులతో సమావేశం నిర్వహించి భూమికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని ఈస్ట్ కోడిపల్లి వద్ద ఉన్న సర్వే నెంబర్ 389లో ఉన్న 37.45 ఎకరాల భూమిని కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ భూముల వివరాలు తెలియజేయాలని ఆర్డీవోను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సూర్యనారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడుకు బయలుదేరిన తెలుగు తమ్ముళ్లు



మహానాడుకు వెళ్లే వాహనాలకు జెండా ఊపుతున్న ఎమ్మెల్యే జయరాం, మహానాడులో పాల్గొన్న ఉరవకొండ నాయకులు

గుంతకల్లు, మే 27(ఆంధ్రజ్యోతి): కడపలో ప్రారంభమైన మహానాడు సభకు గుంతకల్లు నియోజకవర్గం నుంచి వందలాదిగా నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఉదయం గుత్తి మండలం తొండపాడు గ్రామం వద్దకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం జెండాను ఊపి వాహనాలను కదిలించారు. దాదాపు 70 వాహనాలలో కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువారం పార్టీ నేత నారా చంద్రబాబు బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలి వస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, హనుమంతు పాల్గొన్నారు.

● ఉరవకొండ, : కడపలో మూడు రోజుల పాటు జరగనున్న మహానాడుకు నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వజ్రకరూరు, విడపనక ల్లు, ఉరవకొండ మండలాల నుంచి ఆ పార్టీ మండల కన్వీనర్లు నూతేటి వెంకటేష్, బీడీ మారయ్య ఆధ్వర్యంలో వాహనాలలో కడపకు వెళ్లారు. టీడీపీ నాయకులు గోనుగుంట్ల నాగేంద్ర, సుధాకర్, వన్నూరుస్వామి, తులసిదాస్ నాయక్, భీమలింగ తదితరులు ఉన్నారు.

గొడవలకు దిగితే రౌడీషీట్లు : ఏఎస్పీ


మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి

పెద్దపప్పూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గొడవలకు పాల్పడితే రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం భూదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని, అక్కడ న్యాయం జరగకపోతే పైస్థాయి అధికారులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేసి రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలాజీరాజు, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఆర్ఐ ప్రసన్నకుమార్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ విన్నర్ రాయలచెరువు జట్టు


ట్రోఫీని అందుకుంటున్న రాయలచెరువు జట్టు

యాడికి, మే27(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన యాడికి మండల క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో రాయలచెరువు జట్టు అత్యుత్తమ ప్రతిభ చూపి విన్నర్‌గా నిలిచింది. విన్నర్ జట్టుకు నిర్వాహకులు ట్రోఫీతోపాటు నగదు బహుమతి అందజేశారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకొని యాడికి మండల క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను నిర్వహించారు. 18రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో మొత్తం 40జట్లు పాల్గొన్నాయి. మంగళవారం యాడికి, రాయలచెరువు జట్ల మధ్య ఫైనల్‌మ్యాచ్ నిర్వహించారు. రాయలచెరువు జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విన్నర్స్‌గా నిలిచింది. యాడికి జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విన్నర్‌జట్టు, రన్నరప్ జట్లకు ట్రోఫిలతోపాటు నగదు బహుమతులను అందజేశారు. బహుమతుల ప్రధానోత్సవంలో నిర్వాహకులు విశ్వనాథ్, తిరంపురం నీలకంఠ, గుండా నారాయణస్వామి, సురేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, సుభాన్, రామచంద్ర పాల్గొన్నారు.

చెరువులకు నీరు విడుదల


యల్లనూరు చెరువుకు వస్తున్న నీరు

యల్లనూరు, మే27(ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకంలో భాగమైన యల్లనూరు, గడ్డంవారిపల్లి చెరువులకు మంగళవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ రెండు చెరువులు ఎండిపోవడం ద్వారా మండలంలో భూగర్భజలాలు అడుగంటిపోయి పండ్లతోటలకు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది. వీటిని మండల నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఆమె స్పందించి జీఎన్ఎస్ఎస్ అధికారులతో మాట్లాడారు. దీంతో కడపజిల్లాలోని తిమ్మాపురం చెరువు నుంచి యల్లనూరు చెరువుకు రెండు మోటార్లను ఆన్‌చేసి నీటిని అధికారులు విడుదల చేశారు.

నెట్టికంటి ఆలయంలో మన్యుసూక్త హోమం


మన్యుసూక్త హోమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

గుంతకల్లు, మే27(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం మన్యుసూక్త హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని యాగశాల లో స్వామి చిత్రపటాలకు, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి పూలు, తులసీ మాలలతో అలంకరించారు. శాస్త్రోక్తంగా యాగాన్ని నిర్వహించారు. రాత్రి ఆంజనేయ స్వామికి వైభవంగా ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కె.వాణి, ధర్మకర్త కె. సుగుణమ్మ, ఏఈఓ వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ వెంకటేశులు పాల్గొన్నారు.

జవాన్‌ను సన్మానించిన జర్నలిస్టులు


జవాన్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టులు

తాడిపత్రి, మే27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిప్రొద్దుటూరుకు చెందిన ఆర్మీ జవాన్ రమాకాంత్‌రెడ్డిని తాడిపత్రికి చెందిన పలువురు జర్నలిస్టులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో పాలుపంచుకొని విజయవంతంగా సేవలు అందించిన రమాకాంత్ ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. విషయం తెలుసుకున్న జర్నలిస్టులు ఆయన ఇంటికి వెళ్లి శాలువాకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు వెంకటరామిరెడ్డి, కన్న, వినోద్, పుల్లయ్య, ఆది, కార్తీక్, నరేంద్ర, పరశురామ్, మధు పాల్గొన్నారు.

గాలిమరల సామగ్రి చోరీపై ఫిర్యాదు

పుట్లూరు, మే27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ. కొండాపురం గ్రామశివారులో ఉన్న గాలిమరల సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని మంగళవారం సాయంత్రం ఆ కంపెనీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ గాలిమరల కింద సపోర్ట్ ది మ్మెలను కట్టర్లతో కట్ చేయడంతో కిందపడిపోయినట్లు తెలిపారు. వాటిని చోరీ చేశారని వివరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గుంతకల్లుటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

● బొమ్మనహాళ్ : సమాజంలో నిరంతరం పెరుగుతున్న ఒత్తిళ్లను అధిగమించి ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి యోగాసనాలు ఎంతగానో ఉపకరిస్తాయని తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, సర్వేయర్ రవితేజ, ఆర్ఐ బాలక్రిష్ణ, ఏపీఎం రామకృష్ణ పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్ : సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఒక ఆయుధం లాంటిదని ఎంపీడీఓ కొండన్న పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం యోగాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆజాద్ రవి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

● గుమ్మఘట్ట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో ఎంపీడీఓ రామకృష్ణుడు ఆధ్వర్యంలో అధికారులకు యోగశిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

● పామిడి : యోగాతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయూష్ వైద్యాధికారిణి జి. కృష్ణవేణి పేర్కొన్నారు. స్థానిక సరస్వతీ విద్యా మందిరం పాఠశాలలో ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకూ మండల స్థాయిలో యోగాపై శిక్షణా తరగతులు ఉంటాయన్నారు.

● గుత్తి : గుత్తికోటలో జూన్ 2న యోగా కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లను ఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, తహసీల్దారు ఓబులేసు పరిశీలించారు. గుత్తి కోటలోని గుర్రపు శాల వద్ద యోగా కార్యక్రమం నిర్వహించేందుకు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ హేమచంద్రకుమార్, మేనేజర్ రాంబాబు, గుత్తి కోట వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, గైడ్ రమేష్ పాల్గొన్నారు.



గుంతకల్లులో యోగాంధ్రపై ర్యాలీ, గుత్తికోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

బాధిత కుటుంబాన్ని ఆదుకోండి: సీపీఐ


డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తాతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు, మే27(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో గోడ పెచ్చులు ఊడిపడి మరణించిన బాలుడి కుటుంబానికి న్యాయంచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాను కోరారు. మంగళవారం ఉదయం డీఆర్ఎంతో భేటీ అయిన జగదీశ్ మాట్లాడుతూ.. ఈ నెల 23న 7వ నంబరు ప్లాట్‌ఫారంలో గోడ పెచ్చులు ఊడి నేలపై పడుకొని ఉన్న మణికంఠ అనే బాలుడు మరణించాడని, ఆ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. బాలుడి కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం, ఒకరికి రైల్వేలో ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, తప్పక చర్యలు తీసుకుంటామని డీఆర్ఎం సీపీఐ నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బి. గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము, వీరాంజనేయులు, ఈశ్వరయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

నీటికుంటలో పడి విద్యార్థి మృతి

డి.హీరేహాళ్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిశలపల్లికి చెందిన ఇంటర్మీడియేట్ చదువుతున్న అరవింద్(18) అనే విద్యార్థి నీటికుంటలో పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గొడిశలపల్లికి చెందిన గుద్దం భాస్కర్‌రెడ్డి, ఓంకారమ్మ వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఉండేవారు. వీరి కుమారుడు అరవింద్ ఇడుపులపాయలో ఇంటర్ సెకెండియర్ పరీక్షలు పూర్తి చేసుకుని.. గత వారం ఎంసెట్ పరీక్షలు కూడా రాసి వచ్చాడు. కాలేజీ వద్దకు వెళ్లి వస్తానని ఆదివారం అరవింద్ ఇంటి నుంచి బయలుదేరాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం గ్రామ పరిసర ప్రాంతాలలో ఉన్న వంక వద్ద ఉన్న నీటికుంటలో యువకుడి శవం తేలాడుతున్నట్లు స్థానికులు గమనించారు. పోలీసులు గ్రామస్థులతో కలిసి సంఘటన స్థలానికి వెళ్లారు. అనంతరం శవాన్ని వెలికితీయగా అరవింద్‌గా గుర్తించారు. మృతుడి తండ్రి గుద్దం భాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చేతికొచ్చిన కుమారుడు ఇలా చనిపోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

గుండెపోటుతో ప్రయాణికుడు..


విలపిస్తున్న అబుసలామ్ కుటుంబ సభ్యులు

విడపనకల్లు, మే 27 (ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరానికి చెందిన అబు సలామ్(50) ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో మృతి చెందాడు. తన భార్య బీబీసారా, కూతుళ్లతో కలిసి బళ్లారిలో ఓ శుభకార్యానికి తిరిగి వస్తుండగా మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వారు ప్రయాణిస్తున్న కేఎస్ఆర్ ఆర్టీసీ బస్సును విడపనకల్లు వద్ద అల్పాహారం కోసం నిలిపారు. ఆ సమయంలో అబుసలామ్‌కు గుండెపోటు రావడంతో బస్సులోని ప్రయాణికు లు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

కణేకల్లు, మే 27(ఆంధ్రజ్యోతి): ఉపాధికూలీలకు పనిచేసే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు పార్వతి కోరారు. మంగళవారం ఆమె మండలంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీలు పనిచేసిన చోట మెడికల్ కిట్లు లేవని అదే విధంగా మంచినీటి సౌకర్యాలు కూడా ప్రభుత్వాలు కల్పించలేదన్నారు. అలాగే వేసవికాలంలో కూలీలకు అందించే మజ్జిగను కూడా సరఫరా చేయలేదన్నారు. వెంటనే ప్రభుత్వాలు ఉపాధికూలీలకు మౌలికసదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సర్మాస్‌బీ, హసీనా, లలిత, అనుమేష్ పాల్గొన్నారు.

పూజలు కలిసికట్టుగా చేయాలి

తాడిపత్రి, మే27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామంలో పూజలు నిర్వహించే విషయంలో ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. వర్షాలు రావాలని పూజలు చేస్తామని ఒక వర్గం ముందుకు రావడంతో గ్రామమంతా కలిసికట్టుగా పూజలు చేస్తే అందరికి అభ్యంతరం ఉండదని మరో వర్గం సూచించడంతో పోలీసులు గ్రామానికి వెళ్లి ఇరువర్గాలకు నచ్చజెప్పారు. అనంతరం ఇరువర్గాలను రూరల్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించుకొని మాట్లాడారు. ఎలాంటి సమస్య అయినా సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించి పంపించారు.

అందుబాటులోకి ఇసుక రీచ్‌లు

పెద్దవడుగూరు, మే27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలకతాళ్ల, చిత్రచేడు గ్రామాల సమీపంలో ఉన్న పెన్నానది పరివాహక ప్రాంతాల్లో రెండు ఇసుకరీచ్‌లు సిద్ధమయ్యాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. మొలకతాళ్ల సమీపంలో ప్రొసీడింగ్ నెంబరు 2164/డీఈ/2024 నిరంజన్‌రెడ్డి, చిత్రచేడులో 2239/డీఈ/2024 రామాంజనేయులు పేర్లతో ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో భూగర్భ గనులశాఖ, రెవెన్యూ అధికారులు పర్యటించి రీచ్‌లను పరిశీలించారు. త్వరలో రీచ్‌ల నుంచి ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు భూగర్భగనుల శాఖ అధికారులు తెలిపారు.